

తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న

# వర్గీకరణ పేరుతో బీజేపీ డ్రామాలు

- **ఇన్నేండ్లైయినా ఎందుకు స్పందించలేదు**
- **కాంగ్రెస్ అయితే కనీసం పట్టించుకోలేదు**
- **మా సంపూర్ణ మద్దుతు బీఆర్ఎస్‌కే**
- **ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న**
- **బీఆర్ఎస్‌కే మాదిగల మద్దతు హర్షనీయం**
- **పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య**

సిరిసిల్ల టౌన్, నవంబర్ 22: అధికారంలోకి వస్తే వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని ప్రకటించిన బీజేపీ ఇంతకాలమైనా కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటని, ఎస్సీ వర్గీకరణ పేరుతో ఆ పార్టీ డ్రామాలాడుతుందని ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి ఎమ్మార్పీస్ జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాదిగలను నట్టేట ముంచిన పార్టీ కాంగ్రెస్ అని విమర్శించారు. ఎన్నోసార్లు ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని వినతులు చేసినా కనీసం పట్టించుకున్నది లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోనియాగాంధీ నుంచి ఉమ్మడి రాష్ట్రంలో ఆఖరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి వరకు మాదిగల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. కాంగ్రెస్ పాలనలో కనీసం రూ.లక్ష ఆర్థిక చేయూతనందించిన దాఖలాలు లేవన్నారు. కాంగ్రెస్, బీజేపీ మతోన్మాద పార్టీలు అని దుయ్యబట్టారు. మాదిగలకు జనాభా దామాషా ప్రకారం పదవుల్లో ప్రాతినిధ్యం కల్పిస్తామని కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత హామీ ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్న కేసీఆర్ నాయకత్వంపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ ఎటువంటి పూచికత్తు లేకుండా దళితబంధు పథకం ద్వారా రూ.10లక్షలు ఆర్థిక సహకారం అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలోని మాదిగలంతా బీఆర్ఎస్ పార్టీని మరోసారి గెలిపించుకోవడంలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో పర్యటించి బీఆర్ఎస్ విజయానికి పాటుపడాలని కోరారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గ్రామగ్రామానికి వెళ్లి మంత్రి కేటీఆర్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటామని స్పష్టం చేశారు. అనంతరం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న కాలంలో కాంగ్రెస్ మాదిగల సంక్షేమానికి చేపట్టిన కార్యక్రమాలేమీ లేవని విమర్శించారు. వర్గీకరణ పేరుతో కాలయాపన చేసి మాదిగలను మోసం చేసిందని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వానికి ఎన్ని సార్లు వినతులు చేసినా కనీసం పట్టించుకోలేదన్నారు. తెలంగాణ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేసి కేంద్రానికి పంపారని గుర్తు చేశారు. కేంద్రం పార్లమెంట్‌లో ఆమోదించాల్సి ఉండగా నిర్లక్ష్యం చేసిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి, మంత్రి కేటీఆర్‌కు మద్దతుగా ఉంటామని ఎమ్మార్పీఎస్ నేతలు ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, కోర్ కమిటీ రాష్ట్ర సభ్యులు కొండ్రు శంకర్, మందాల యాదగిరి, ఎల్కపల్లి కుమార్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధు, బీఆర్ఎస్ నేత కత్తెర వరుణ్, ఎమ్మార్పీఎస్ నాయకులు తాటిపల్లి బాబు, నగేష్, రమేశ్,పాల్గొన్నారు.

# బీజేపీ నయా పాలిట్రిక్స్

- **ప్రచారంలో కొత్త ఎత్తులు**
- **ఎన్నికల కమిషన్‌కు చిక్కకుండా పెండ్లి రోజుల పేరిట విందు భోజనాలు**
- **మొన్న కథలాపూర్.. నేడు చందుర్తిలో నిర్వహణ**

వేములవాడ, నవంబర్ 22: వేములడాడ బీజేపీ నయా పాలి'ట్రిక్స్' ప్లే చేస్తున్నది. ఓటరు దేవుళ్లను ఆకట్టుకునేందుకు కొత్త ఎత్తులతో ముందుకుసాగుతున్నది. నియోజకవర్గంలో పెండ్లి రోజుల పేరిట విందు భోజనాలు, దావత్‌లు ఏర్పాటు చేస్తుండగా, బీజేపీ తీరు చర్చనీయాంశంగా మారుతున్నది. కేంద్ర మాజీ మంత్రి, మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు తనయుడు చెన్నమనేని వికాస్ వేములవాడ బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలిచిన విషయం తెలిసిందే. కొడుకు గెలుపు కోసం తండ్రి ఆరాటపడడం సర్వసాధారణమే అయినప్పటికీ వారు వ్యవహరిస్తున్న తీరు అందరినీ ముక్కున వేలేసుకునేలా చేస్తున్నాయి. ప్రచారం అంటే తప్పనిసరిగా ఎన్నికల అధికారుల అనుమతి తీసుకోవాలి, అందుకు అయిన లెక్కలు అప్పగించాల్సి ఉంటుంది. అయితే ఇలా పెండ్లి రోజుల పేరిట ఇచ్చే విందు, వినోదాలతో ఓటర్లను ఆకట్టుకుంటూ ఈసీకి చిక్కకుండా ముందుకుసాగుతున్నారు.

**పెండ్లి రోజుల పేరిట విందు భోజనాలు..**

ముఖ్యంగా పెండ్లి రోజుల పేరిట విందు భోజనాలు పెడుతూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఐదు రోజుల క్రితమే కథలాపూర్‌లోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ నాయకులు బద్రి సత్యం 25వ పెళ్లిరోజు వేడుకలు అట్టహాసంగా నిర్వహించి, విందు భోజనాలు పెట్టారు. తాజాగా బుధవారం చందుర్తిలోని పెరిక ఫంక్షన్ హాల్‌లో ఆపార్టీ నాయకుడు అల్లాడి రమేశ్ సైతం తన 25వ పెళ్లిరోజు వేడుకలు కూడా ఇలానే నిర్వహించారు. ఇటీవలే 25వ పెళ్లిరోజు ముగిసినప్పటికీ ఎన్నికల నేపథ్యంలో మరోసారి నిర్వహించుకున్నారు. ఈ వేడుకకు మండలంలోని 800 మందిని తరలించినట్లుగా తెలిసింది. ఈ వేడుకలకు చెన్నమనేని విద్యాసాగర్‌రావు హాజరై ప్రచారం చేస్తున్నారని ఇతర పార్టీల నాయకులు చెబుతున్నారు.

**ఎన్నికల ఖర్చు తప్పించుకునేందుకే...**

ఎన్నికల ఖర్చు తప్పించుకునేందుకు పెళ్లి వేడుకల పేరుతో సభలు నిర్వహిస్తున్నారని ఇతర పార్టీల నాయకులు ఆరోపిస్తున్నారు. పెళ్లి వేడుకలు అంటే బంధువులు స్నేహితులు తెలిసిన వాళ్లు మాత్రమే వస్తారని, అన్ని వర్గాల ప్రజలు హాజరవడమే కాకుండా ఏర్పాట్లు పూర్తిగా సభ నిర్వహణ కోసమే చేసినట్లుగా ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి. ప్రతి విషయాన్ని భూతద్దంలో పెట్టి చూసే ఎన్నికల కమిషన్ వేములవాడ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ చేస్తున్న ఈ ప్రచారంపై మాత్రం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వచ్చాయి.


చందుర్తిలోని ఒక ఫంక్షన్ హాల్‌లో పెళ్లి రోజు వేడుకలో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్ రావు


గోపాలరావుపేట ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

# ఊపిరి ఉన్నంత కాలం ప్రజల వెంటే..

**చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

చొప్పదండి (రామడుగు) నవంబర్22 : 'నా ఊపిరి ఉన్నంత కాలం ప్రజల వెంటే ఉంటా' అని చొప్పదండి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. బుధవారం రామడుగు మండలంలోని గోపాల్‌రావుపేటలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. అనంతరం గోపాల్‌రావుపేట బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన ప్రచార సభలో ఆయన మాట్లాడారు. తాను స్థానిక బిడ్డనని, అందుబాటులో ఉండి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నానని, ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులను చూసి మోసపోవద్దని సూచించారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇక్కడిలాంటి పథకాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. గోపాల్‌రావుపేట ప్రజల చిరకాల వాంఛ అయిన మండల కేంద్రం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ప్రచారంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, కలిగేటి లక్ష్మణ్, నాగిశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఎడవల్లి నరేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోడూరి మణెమ్మ – మల్లేశం, కొండగట్టు డైరెక్టర్ దాసరి రాజేందర్‌రెడ్డి, ఎడవల్లి పాపిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు వేల్పుల హరికృష్ణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కొలిపాక మల్లేశం మచ్చ గంగయ్య, మాజీ ఎంపీటీసీ దాసరి లక్ష్మి అరుణ్ కుమార్, మాజీ సర్పంచ్ నేరెళ్ల అంజయ్యగౌడ్, నాయకులు రేణికుంట బసంతం, పైండ్ల శ్రీనివాస్, రేణికుంట అశోక్, రాజిరెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, సుద్దాల మల్లేశం, పురాణం రమేశ్, కొలిపాక మల్లయ్య, తిరుపతి, రఘు, దాసరి అనిల్, అల్వాల విష్ణు, అల్వాల శంకర్, కొలిపాక కమలాకర్, కొమురయ్య, ఆనందం, పైండ్ల మధు, రేణిగుంట శ్రీనివాస్, టేకు రాజేశం, కాసారపు పరుశురాం, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# నాగంపేట ఎంపీటీసీ బీఆర్ఎస్‌లో చేరిక

- **కేటీఆర్‌తోనే గ్రామాభివృద్ధి సాధ్యమైతుంది**
- **తోట ఆగయ్య సమక్షంలో పార్టీలోకి నాగభూషణం**



ఎంపీటీసీ నాగభూషణంను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

గంభీరావుపేట, నవంబర్ 22: మండలంలోని నాగంపేట ఎంపీటీసీ మేర్గు నాగభూషణం బుధవారం బీఆర్ఎస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య వారికి పార్టీ కాండువా కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ నాగభూషణం మాట్లాడారు. బీఆర్ఎస్‌తోనే అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మంత్రి కేటీఆర్ సహకారంతో గ్రామాలు సమగ్రాభివృద్ధి చెందుతున్నాయని వాటికి ఆకర్షితులై పార్టీలో చేరానన్నారు. కేటీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవడానికి కృషి చేస్తానని ఎంపీటీసీ పేర్కొన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘ జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య, ప్రధాన కార్యదర్శి దిడ్డి రాజు, బీఆర్ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, నేతలు కొండ ప్రతాప్, కుంబాల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్, బీజేపీని నమ్మితే నష్టపోతాం

జమ్మికుంట, నవంబర్ 22 : కాంగ్రెస్, బీజేపీని నమ్మితే నష్టపోతామని, ప్రజా వ్యతిరేక పార్టీలకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న బీఆర్ఎస్‌కే మద్దతు ఇవ్వాలని కోరారు. బుధవారం ఆయన జమ్మికుంట మండలంలోని సైదాబాద్, సాయంత్రం మున్సిపల్ పరిధిలోని కృష్ణకాలనీ (26,27,28వ వార్డులు), శివాలయం ఏరియా(25, 30 వార్డులు), హుజూరాబాద్ రోడ్డు(6,7,21 వార్డులు), కొత్తపల్లి(4,5,17,18,19,20 వార్డులు)లో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్‌తో కలిసి విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజల నుంచి ఘన స్వాగతం లభించింది. మహిళలు పూలు చల్లుతూ మంగళహారతులు పట్టి దీవించారు. జై తెలంగాణ.. జై కేసీఆర్.. జై కౌశికన్న.. అంటూ యువత నినదించారు. కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినీరెడ్డి ప్రతి మహిళకూ బొట్టు పెట్టి, తన భర్తను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను నమ్మితే వ్యవసాయానికి మూడు గంటల కరెంటిస్తారని, మూడు గంటల కరెంటు రైతులకెట్లా సరిపోతదని ప్రశ్నించారు. 10 హెచ్‌పీ మోటర్లతో రైతులకు కలిగే ఇబ్బందులను వివరించారు. గతంలో కాంగ్రెస్ పెట్టిన కష్టాలను, ప్రస్తుతం కర్ణాటకలో చేస్తున్న ఇబ్బందులకు చెప్పారు. మూడు గంటల కరెంటు.. 24 గంటల విద్యుత్‌పై చర్చ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌వన్నీ ఉత్తుత్తి గ్యారెంటీలనని ఆరోపించారు. ఆయన వెంట డీసీసీబీ వైస్ చైర్మన్ పింగిళి రమేశ్, మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.